# బరువు సామాను

బెంగా బరువుగా అనిపించింది నాకు. ఫోటోలు తీసేసిన తరువాత గోడలు బోసిపోయాయి. ఫోటో ఉన్నంత మేరా తెల్లగా, మిగతా గోడ మాసిపోయి వెక్కిరిస్తున్నట్టుగా ఉంది. ఒక విచిత్రమైన శూన్యానికి పటం కట్టినట్టుంది. అలాగే బీరువా వెనక. వంటిల్లు భీభత్సంగా ఉంది. హాల్లో దట్టంగా కాయితం ముక్కలూ ఎక్కడ చూసినా దుమ్ము. అవ్యవస్థ. కుర్చీలో పడేసిన పుస్తకాలు పక్కన బెట్టి కూచున్నాను. లోపల పడ్గగదిలో సరస్వతి కొడుకు చేత మంచాలు ఊడబెరికిస్తోంది. పేరుకి నా గది అది. పూర్తి యాజమాన్యం ఎప్పుడూ లేదు. నిన్న రాత్రి కూడా నన్ను మోసింది మంచం. వాడు పని చేస్తున్నంత సేపూ సరస్వతి మాట్లాడుతూనే ఉంది. ఏ పనీ ''చాతావాతా కాక''పోవడం అది కూడా నా పోలిక కావడం, బద్ధకం అనేది మా వంశంలో ఎలా జీర్ణించుకు పోయిందో, చివరికి వాడు కూడా ''మీ నాన్నలాగే'' ఎలా తయారవక తప్పదో చెప్తూనే ఉంది. మొత్తానికి బాబిగాడు ఒక మంచం ముక్క చెక్కలుగా విడగొట్టేడు. ఫేనుగాలికి చిరిగి ముక్కలైన పాత ఉత్తరాలు, కాయితం ముక్కలూ అల్లల్లాడుతున్నాయి. సగం సర్దిన అట్టపెట్టెలూ, మాసిన బట్టల మూట, పాత బట్టల మూటలూ, పుస్తకాల కుప్పలూ నా చుట్టూ పరుచుకున్నాయి. అంతా అస్తవ్యస్తంగా ఉంది. ఈ గందరగోళం మధ్యలో సిగరెట్టు వెలిగించాను. అయిదు సంవత్సరాల జీవితం ఈ చతురస్రాల్లో, దీర్ఘ చతురస్రాల్లో గిన్నెల్లో నీళ్లలాగ ఇమిడిపోయింది. ప్రస్తుతం తూము బిరడా తీసేశారు.

''ఆ మంచాల కింద చూసి చీపురు వెయ్యవే అంటే నీలిగి చచ్చేది. ముందా స్క్రూ విప్పు''

ఇంటివారి రెండో అల్లుడికి బదిలీ అయి ఇక్కడకు వస్తున్నాడు. ఇల్లు ఖాళీ చెయ్యమని కాఫీ ఇచ్చి చెప్పేడు ఇల్లు గలాయన. కాఫీ తాగుతూ కొత్త ఇంటి గురించి ఆలోచిస్తూ కూచున్నాను. ''మరి మీకు ఇబ్బంది కలిగిస్తున్నాను. ఏమీ అనుకోకండి'' క్షమాపణ ఖాళీ కప్పులో పడింది. ఇంటికి రాగానే శుభవార్త మా ఆవిడ చెవిన వేశాను. సరస్వతి వంకాయలు తరుగుతోంది. ప్రతి వంకాయ నీ ఇల్లు గలాయనగా భావిస్తోంది. ''అయినా అయిదేళ్లయిందిగా. కొత్త పరిసరాలూ కొత్త ఇల్లూ...'' అన్నాన్నేను. ఇల్లుగలవారిని నీళ్లలో వేస్తూ నా మాటలు పట్టించుకోలేదు సరస్వతి. గడువిచ్చిన నెలరోజులూ తిరిగేను. రోజూ ఇంటికి రాగానే అన్నం వడ్డిస్తూ సొంత ఇల్లు లేకపోవడం, బదిలీలమీద మాట్లాడుతూ మధ్యలోనా చాతకానితనాన్ని నంచుకోడానికి వేసేది. (''అసలు ప్రాక్టికల్‌గా ఉండటం అంటే ఏమిటీ సరస్వతీ?'')

ఓరోజు అంది:

''మన ఖర్మ కాకపోతే వాడికీ ఊరే ట్రాన్స్ఫరవాలా?''

''కానీ నాకు ట్రాన్స్ఫర్లంటే ఇష్టం''

''మీకు మంచివెలాగూ ఇష్టం వుండవు''

''నిజం సరస్వతీ, కొత్త మనుషులూ, కొత్త ఊరూ - జీవితం మళ్లీ మొదలెట్టినట్టుంటుంది''

''కొంపదీసి మళ్లీ ట్రాన్స్ఫర్‌కి పెట్టుకున్నారా?''

''లేదు ఈసారి రాజమండ్రీ వెళ్లాలనుంది''

''అక్కడేవుందండీ మన ముల్లె''

''గోదావరి. వరద గోదావరి నాకు మరీ ఇష్టం. నీళ్లలో కొట్టుకొచ్చే దుంగల కోసం టైర్లమీద చిన్న చిన్న కుర్రాళ్లు ఈదుతూ ఉంటారు. ఎంత

బావుంటుందో తెలుసా? నాకూ వాళ్ళలాగ నీళ్ళలోకి వెళ్లాలనుంటుంది. ఈ దడం వచ్చుగానీ భయం''

''మజ్జిగలోకి అన్నం పెడతాను''

చిన్న వరండా, పేము కుర్చీలో కూచుని అగ్నికార్యం మొదలెడతాను.

''ఊ. ఇల్లేవైనా దొరికిందా?''

''లేదు. ఏదో ఒకటి దొరుకుతుందిలే. కాస్త ఇంటిముందు చెట్టు ఉన్నది దొరికితే బాగుండును''

''మీ పిల్లలకి మీ బుద్ధులే వచ్చేయి''

''మంచిదేగా''

''మంచిదే లెండి. మీలాగే బాగుపడరు''

నవ్వింది సరస్వతి. లోపల గదిలో మంచం పూర్తిగా ఊడదీసి తాళ్లతో కడుతున్నాడు బాబీ. రెండు నిలువు కట్టెలూ, రెండు చెక్క పలకలూ, బద్దలూ. ఆకారం మారినా మంచం అంటామా? సిగరెట్టు ముక్క పారేస్తూ చూశాను. చిన్న స్థలం అయినా గేటు ఇవతల జామచెట్టు పచ్చగా విస్తరించింది. ఒక్కోసారి చిలకలు గుంపుగా వాలి కాయల్ని వెతుక్కుంటాయి. చెట్టంతా చిలకలా ఉంటుందప్పుడు.

హాల్లో సామాన్లు అటూ ఇటూ జరిపి భోజనం ఏర్పాట్లు చేసింది సరస్వతి. పడగ్గది పక్కనే మరో గది ఉంది. బట్టల స్టాండూ, బీరువా అవీ ఉండేవి. లోపల అట్టపెట్టెలతో అడుగు పెట్టడానికి చోటు లేదు. ఇంత సామాను ఎక్కడిదీ! హాలునిండా, గదుల్నిండా సామాను. ఈ సామానంతా ఇంతకాలం నేను మోస్తున్నానా? ఆఫీసుకెళ్లడానికీ, ఆలోచించడానికి ఎంత సామాను అవసరం అవుతుంది? పెద్దపెద్ద పెట్టెలున్న తోపుడు బండిని నేను వీధుల్లోంచి లాక్కెడుతున్నట్టు కళ్లముందు కనిపించింది. నా వీపుమీద ఎవరో ట్రంకుపెట్టెలు పెడుతున్నారు.

''అన్నం పెట్టింది నాన్నా'' వాడివేపే ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాను.

''రండీ''

''అదిగాదురా. ఈ సామానంతా ఏవిట్రా?''

''ఇక్కడివే నాన్నా. కొన్ని బెడ్రూంలోవి కూడా ఉన్నాయి. అమ్మే సర్దింది. అన్నం తిని తాళ్లు కడతాను''

''నీ మొహం. అసలీ సామానంతా ఏవిటంటున్నాను'' నవ్వేడు వాడు.

''మరేం చేద్దాం నాన్నా?''

''ఇవన్నీ తీసికెళ్లాలా? కొన్ని పారెయ్యొచ్చుగా''

''అమ్మ నడగండి''

''అమ్మ నడిగే దేవిట్రా. అడ్డమైన చెత్తంతా పోగుచేస్తుంది. అన్నీ అవసరమే నంటుంది. అదో, అందులో ఏవుంది?''

''పాత ఎలక్ట్రిక్ సామాను. ఏవో స్విచ్‌లూ అవీ. రండి అన్నం పెట్టేసింది''

నాకు ఆకలిగా లేదు. ఒళ్లంతా బరువెక్కినట్టయింది. ఇంకా రేపంతా సర్దాలి. అంటే నాకు తెలీకుండా నా జీవితం నిండా పరుచుకున్న సామాను రాశిగా ఏర్పడి దర్శనం ఇస్తుందన్నమాట.

''తినండి. ఏవిటాలోచిస్తున్నారు?''

''ఆ గదిలో చెత్తంతా ఏవిటి?''

''చెత్తా? వాటిల్లో పనికిరాని వస్తువు ఒక్కటి చూపించండి''

''ఒకటేవిటి? అన్ని పెట్టెల్లోనూ అన్నీ అవసరమైనవేనా? ఆ పాత ఎలక్ట్రిక్ సామాను ఎందుకు? అదేవిట్రా, ఆ పెద్ద అట్టపెట్టెలో కుక్కింది?''

''అవి మీ పాత బట్టలు''

''ఎందుకవీ? ఎవరికేనా ఇవ్వచ్చుగా. ఛఛ. ఏవిటీ సామాన్లు''

''అన్నీ అవతల పారెయ్యడవే. ఎలక్ట్రిక్ సామాన్లు ఎందుకేనా పనికొస్తాయి. మీ

పాత బట్టలిస్తే పనికొచ్చే స్టీలు సామాను ఒస్తుంది''

''గాడ్. అంటే ఉన్న సామాను చాలక ఇంకా కొంటావా! అవన్నీ నెత్తిన పెట్టుకొని మోసుకెడతావా? లేకపోతే ఏదేనా హోటలు పెడతావా?''

''అబ్బబ్బ. గిన్నెలెందుకేవిటండీ, కొంపలో గిన్నెలూ చెంబులూ ఉండవా! సంసారం గురించి మీకేం తెలుస్తుంది లెండి''

''ఏం తెలియాలి? అడ్డమైన వస్తువుల్నీ కొనడం, వాటిని దాచడం, అన్నీ తడిసి మోపెడయి నామీద పడతాయి''

''మీరూరుకోండి. మీకెందుకు? సద్దుకునే దాన్ని నేను''

''నీకు అర్థం కాదేం. అసలు ఈ సామానంతా ఎందుకు చేర్చినట్టు! ఇప్పుడు సద్దుకోడం ఎందుకు! ఎంత బరువు, ఎంత అవసరమో ఆలోచించావా? ఒదిలించుకోడం చాతాదు. నాకేవీ తెలీదనడం మాత్రం తెలుసు''

''ఇల్లు మీకు అప్పచెప్తే అన్నీ పారేస్తారు. హాయిగా కట్టుబట్టల్తో ఇల్లు మారుదురుగాని''

''అసలీ పోగు చేసే బలహీనత ఏవిటి నీకు? ఇంత సామాను లేకుండా బతకలేవా!''

''ఊ అందుకే మన సంసారం ఇలా ఉంది''

''ఎలా ఉంది! ఉన్న నాలుగ్గదుల్లో సందులేకుండా సామాన్లు కుక్కడవా సంసారం అంటే. రోజుకో బొచ్చె, బాల్చీ కొనడం సంసారం అంటారా!''

''మీకీ సన్యాసి బుద్ధులుండబట్టే ఇలా ఉంది''

''నాన్నకి సన్యాసి బుద్ధులెక్కడున్నాయే''

''ఉన్నవన్నీ అవే. ఓ సంసారం చట్టుబండలూ అక్కర్లేదు. దమ్మిడీకి కొరగాని స్నేహితుల్తో కాలక్షేపం మాత్రం చెయ్యగల్రు''

''ఈ చెత్తంతా ఆ ఇంటికొక్కడా తీసుకొస్తావన్నమాట. సంసారం అంటే

సామాన్లని తెలీదు నాకు. I will throw them out"

''అది లేకుండా ఇదుండదు''

చెయ్యి కడుక్కుని వరండాలో కూచున్నాను. నేనెందుకు ఎందుకూ కొరగాని వాణ్ని, నాకంటే ఎందుకూ కొరగాని వాళ్లనే స్నేహితుల్ని చేసుకుంటానో సరస్వతి కొడుక్కి చెప్పుకుంటోంది. నేను కిటికీలోంచి లోపలికి చూస్తున్నాను. యుద్ధ భూమిలా ఉంది ఇల్లంతా. నిన్నటి వరకూ శుభ్రంగా పద్ధతిగా ఉండేది. ఇల్లంతా సిగరెట్లు మిళితమైన అగరొత్తుల పరిమళం వ్యాపించి ఉండేది. ఈ ఇల్లు నాది కాదు. నేనిక్కడ ఉండటం లేదు. తల్లీ కొడుకులిద్దరూ చాప పరుచుకుని నడుం వాల్చేరు. నేనలా పడక కుర్చీలోనే కునుకుతీశాను. కలలో పెద్ద రైలు వేగను నేను ఒక్కణ్నే తోస్తున్నాను. నాకు ఒంటిమీద చొక్కా లేదు. అందరికీ చొక్కాలున్నాయి. నాకే లేదు. పట్టాలమీంచి మెల్లిగా భారంగా కదుల్తోంది వేగను... హఠాత్తుగా వేగను మా వీధిలోకి తిరిగింది. నేను తోస్తూనే ఉన్నాను. నాకు చొక్కా లేదు. కిందపడి భళ్లుమంది. చటుక్కున మెళకువ వచ్చేసింది. నడుం కొంచెం కలుక్కుమంది.

''ఏవిటా శబ్దం? ఏదేనా పగిల్తే అవతల పారెయ్యండి''

''కేరియర్ గిన్నెలు జారిపడిపోయాయి నాన్నా''

నిద్ర చెదిరిపోయి మళ్లీ గందరగోళంలో పడ్డాను. లేచి హాల్లోకి అడుగు పెట్టగానే నాలుగు గోడలకీ చేరవేసి కొత్త అట్టపెట్టెలూ, మధ్యలో గిన్నెలూ, వస్తువులూ. అందులో అనేకం ఇదివరకు చూసిన జ్ఞాపకం లేదు. సామాన్లు. బాబీ కుట్టుమిషన్ని ఓ పక్కకి లాగుతున్నాడు. దానికి రెండు చక్రాలే ఉన్నాయి. నేల కీచుమంటోంది. కీచు, వానపాములా నా వెన్నెముకలో చేరుతోంది. క్రీక్రీచ్చు!! హారిబుల్. సంవత్సరం క్రితం పక్క ఇంట్లో సుబ్బారాయుడి గారికి బదిలీ అయింది. ఎందుకో కుట్టు మిషను అమ్మెయ్యాలనిపించి ఆయన భార్య సరస్వతి సలహా అడిగింది. వెంటనే కొనేసింది సరస్వతి. సాయంత్రం ఇంటికి రాగానే చంటిపిల్లాడికి స్నానం చేయించినట్టు కుట్టుమిషన్ని శుభ్రం చేయిస్తోంది సరస్వతి. నాకు కాసేపు మాట రాలేదు. ''లక్ష్మిగారి దగ్గిర కొన్నాను''

''ఎందుకు?''

''ఎందుకేవిటండీ. ఇది కొత్తది కొంటే ఎంతవుతుందో తెలుసా?''

''ఎంతయితే మనకేం? సినిమాల్లోలా జాకెట్లు కుట్టి సంసారం నడుపుతావా? నువ్వు సంవత్సరానికి ఎన్ని బట్టలు కుడుతున్నావు? అసలు మిషన్ తొక్కగలవా? చౌకగా వస్తే కొనెయ్యడవే? మనకెందుకసలు?''

''అయినా మీకు చెప్పడం నా బుద్ధి తక్కువ''

''చెప్పడం కాదు కొనడం బుద్ధి తక్కువ. ఆవిడ ఒదులుచ్చుకుంది. అనవసరంగా ఇదో బరువని తెలీడంలా నీకు?''

''మీకన్నీ అనవసరం. బరువూ, వేస్టూను. మీరేవేనా మోస్తున్నారా?''

''నేను మొయ్యక్కర్లేదు. మోస్తేనే బరువా? ఇది నాకు కనిపించడానికి వీల్లేదు. I hate it.''

వారం తిరక్కుండానే ఎనభై రెండు రూపాయలతో కొంచెం బాగు చేయించింది. రెండు నెల్ల తరువాత మిషన్ బాగు చేసుకునే కిట్ మూడొందలైంది.

''ఒరేయి, ఆ దరిద్రపు మిషను ఇక్కడే వదిలెయ్. లేదా పాత ఇనప సామాను వాడికి అమ్మిపారెయ్యి''

''సరే నాన్నా''

''నోర్మూయ్యరా వెధవా. ఆయనకి తాన తందాన''

''సరస్వతీ ఇరవై ఏడేళ్లనుంచీ చూస్తున్నాను. అసలు నీ సైకాలజీ ఏవిటి? వాటీజ్ రాంగ్?''

''మిమ్మల్ని దేవుడుకూడా మార్చలేడు''

సరస్వతి చిన్న చిన్న డబ్బాలన్నీ ఒక అట్టపెట్టెలో పెట్టి, అటువంటి నాలుగు పెట్టెల్ని పెద్ద పెట్టెలో పెడుతోంది. ఆమె ముందు నాలుగు పెద్ద పెట్టెలున్నాయి.

వాటినిండా సామాన్లున్నాయి. పెట్టెలమధ్య కూచుని ఏకాగ్రతతో చిన్న పెట్టెలనీ, పెద్ద పెట్టెలనీ, మధ్యస్తంగా ఉండే పెట్టెలనీ, పెట్టెలు... పెట్టెలు... నాకాలి దగ్గిర అప్పుడే ఖాళీచేసిన (''బాబీ ఈ చిన్న పెట్టెలు పనికిరావని పారెయ్యకు. పనుంది'') చిన్న అట్టపెట్టె పెట్టింది సరస్వతి. నాకవసరం లేదది. లుంగీ ఎత్తి కట్టుకుని జాగ్రత్తగా గురిచూసి ఫుట్‌బాల్‌లా కిటికీ వేపు చూసి తన్నేను. నేను అనుకున్నంత ఎత్తు లేవలేదు. కిటికీ ఇవతలే పడిపోయింది. అయితేనేం. సంసారం చెయ్యడం చాతకానివాళ్లు పెళ్లి ఎందుకు చేసుకోకూడదో సరస్వతి ఉచ్ఛైస్వరంతో వెలిబుచ్చింది.

అట్టపెట్టెల్లోంచి, అరాచకంలోంచి సాయంత్రం వీధిలో పడ్డాను. కానీ ఎక్కడికీ వెళ్లాలనిపించలేదు. సిగరెట్టు వెలిగించి కిళ్లీ కొట్టు దగ్గిరే నిల్చుండి పోయాను. అనాలోచితంగా నడుస్తూ కొత్త ఇల్లున్న వీధిలోకి వెళ్లేను. ఈ సందు కొత్తదేం కాదు. అనేకసార్లు ఇలా వచ్చేను. అయినా ఇప్పుడు కొత్తగా అనిపిస్తోంది. ఇంటివారు మేడమీద ఉంటారు. పైన లైట్లు వెలుగుతున్నాయి.

''ఏవిటీ అక్కడే నుంచుండిపోయారు? ఉండండి తాళం పంపిస్తాను. ఇల్లంతా కడిగించే నివాళ''

పిట్టగోడ మీంచి ఒంగి అరుస్తున్నాడాయన. నేను గేటు ముందు నుంచున్నానని స్పృహ వచ్చింది. తాళం తీసుకుని లోపలికి వెళ్లేను. హాల్లో లైటు వేసి చుట్టూరా చూశాను. చల్లగా విశాలంగా నిశ్శబ్దంగా ఉంది. గదులన్నీ తిరిగేను. ప్రశాంతంగా ఉంది. తలుపు దగ్గిరగా వేసి గోడనానుకుని కూచుని సిగరెట్టు వెలిగించాను. కిటికీలోంచి గాలొస్తోంది. ఇది నా కొత్త అస్థిపంజరం. అందులో కూచున్నట్టుంది. నేల చల్లగా ఉంది. రెండు అరచేతులూ గచ్చుమీద ఆనించాను. హాల్లో పెద్దఅలమర పెట్టించారు. బహుశా అందులో నా పుస్తకాలు పెడుతుందనుకుంటాను. (''చెదలు తినేసినా ఈ పుస్తకాలు మాత్రం బరువనిపించవు పాపం''). మంచాలు ఎలాగూ పడగ్గదిలో. లోపలి గదిలో పెద్ద అటక ఉంది. బోలెడు ఖాళీ అట్టపెట్టెలూ, కొన్ని నిండువీ అటకలెక్కు తాయి. అన్ని గదుల్లోకీ సామాను చేరుతుంది. మిగుల్తుంది. వంటింట్లో అటక మీద వాడని బిందెలూ, గిన్నెలూ, గిన్నెల్లో కొన్ని గిన్నెలు, ఒక సీమ వెండి కేరియరు... బీరువా మీద ఖాళీ సూట్‌కేసులు. రైలు లాగ గదులున్న ఇల్లంటే

ఇద్దరికీ ఇష్టం లేదు. అస్సలు. ఎక్కువ గదులున్న ఇళ్లు కట్టడం మానేశారు. అన్నీ కాంక్రీటు పావురాయి గూళ్లు. రేపీ పాటికి నేల చల్లగా ఉండదు. హాల్లో, గదుల్లో, అనేక అట్టపెట్టెల్లో గుట్టలుగా పడుంటాను నేను. సరస్వతీ, బాబీ మంచాలు బిగిస్తారు. పెట్టెలు ఖాళీ చేసి దాస్తారు. అలిసిపోయిన మొహం చిరు చెమటతో మెరుస్తూంటుంది. ''ఆ లారీ వెధవ'' దార్లో ఏ వస్తువువూ పారెయ్యలేదు గదా అని కలవరపడుతుంది. (''ఈ గది ఒక్క చుట్టు పెద్దది ఉండాల్రా...'') ఎక్కడున్నా నా టేబిలు, కుర్చీ తరచుగా స్థలం మారుస్తుంటాను. మార్పులో కొత్తదనం బాగుంటుంది నాకు. ఏదిక్కులో బరువుండకూడదో నిర్ణయిస్తుంది సరస్వతి. బరువెందుకసలు? ఏ మూలా ఏ బరువూ ఉండదు కదా. ఇల్లు తాళం పెట్టి బయటపడ్డాను.

''ముందు మీరు భోంచెయ్యండి. వాడూ నేనూ తింటాం'' అంది సరస్వతి.

''ఈ సామాన్ల మధ్య నువ్వు కూడా సామాన్లా ఉన్నావు''

''అంతేనా, నాకు విలువ లేదని అర్థవా?''

''నీకు ఎంత ఇల్లయినా సరిపోదు''

''పోనీలెండి''

''ఏదేనా సత్రం లాంటిదయితే సరిపోతుందేమో. ట్రాన్స్ఫరైతే రెండు వేగన్లు సరిపోతాయా?''

''అబ్బబ్బ. ఏం మళ్లీ ట్రాన్స్ఫరవాలనుందా, చంపేస్తున్నారు''

''అయితే తప్పా?''

''మీరు మేడమీద చాపేసుకు పడుకోండి. బాబీగాడు తరవాత లేపుతాడు''

''నీకు నసలాగే ఉంటుంది. ఈ సామాన్ల యావ నీకు ఎప్పుడు వదుల్తుంది?''

''ఈ సంసారం ఉండేంతవరకూ, నే బతికున్నంత కాలం. అంత అక్కర్లేని వాళ్లు సన్యాసం తీసుకోవాల్సింది''

''సంసారం అంటే?''

చాప, దిండు తీసుకెళ్లి డాబామీద పడుకున్నాను. వెల్లకిలా పడుకుని సిగరెట్టు వెలిగించాను. ఆకాశం అప్పుడే కడిగిన మొజైక్ గచ్చులా ఉంది. నక్షత్రాల గుత్తులు తెల్లగా మెరుస్తున్నాయి. ఉండుండీ చల్లటిగాలి కెరటాలు మెత్తగా నా మీద పడుతున్నాయి. ఉన్నట్టుండి నక్షత్రాల కింద తెల్లటి కొంగలు నల్లటి ఆకాశానికి వెండి అంచుమల్లే కనిపించాయి. మెత్తగా, నిశ్శబ్దంగా, ఏకోన్ముఖంగా కొంగల గీత కళ్లలోంచి వెళ్లిపోయింది. ఫైలు రెక్కలకింద పెట్టుకుని అలా ట్రాన్స్ఫరై వెళ్లాలి. కార్లమీంచీ, బస్సులమీంచీ, రొదలమీంచీ, ఇల్లు మారడాల మీంచీ, సామాన్లమీంచీ, ఊళ్లమీంచీ ప్రశాంతంగా కొత్త గూళ్లకి చేరుకుంటాయి. ఈ రహస్య యానం ఎవరి కళ్లబడుతుంది? ఆకాశం ఖాళీ అయిపోయింది. మూవయాలుగా సరస్వతి మల్లే చంద్రుడూ, ఆమె చుట్టూ అట్టిపెట్టెల్లాగ నక్షత్రాలూ. కళ్లు మూసుకున్నాను. కాసేపటికి ఏదో పరిచితమైన పౌడరు పరిమళం.

''నిద్రపోతున్నారనుకున్నాను. వాడింకా రాలేదు. రెండు చెంబులు నీళ్లు పోసుకుని వచ్చేను. ఇంక సద్దే ఓపిక లేదు ఇవాళ్టికి'' పక్కనే చాపమీద కూచుంటూ అంది సరస్వతి. ఆమె చేతులు చల్లగా హాయిగా ఉన్నాయి.

''నువ్వు కష్టపడ్డం ఏవీ బాగాలేదు''

''బావుంది. దీనికి ఎవర్నైనా పెడితే డబ్బుకి డబ్బూ దండగ. చిన్నా చితకా వస్తువులు పట్టుకుపోతారు''

''మంచిదేగా శ్రమ తపుతుంది.''

''వస్తువులు పోవుటండీ?''

''అంత శ్రమా, అన్ని వస్తువులూ ఉండకూడదందుకే. రెండు రోజుల్నించి సద్దుతున్నావు. అంతూ దరీ కనిపించడం లేదు. ఈ వస్తువుల సముద్రంలో కొట్టుకుపోతున్నాం''

''బావుంది''

''ఇందాకా కొత్త ఇంటికి వెళ్లేను''

''ఏం?''

''ఖాళీగా హాయిగా వుంది.''

''సరే ఇంకేం, మీరొక్కరూ అక్కడుండండి. నా కొడుకూ నేనూ ఇక్కడుంటాం''

''కుదరదు గదా''

''కుదుర్చుకోండి. మీకు సామాన్లు వద్దు. సంసారం కావాలి. మీరు విడిగా వుండండి. మీకు సుఖంగా ఉంటుంది. నాకు నసా తప్పుతుంది. జరగండి''

''ఇప్పుడే ఓ కొంగల బారు దక్షిణంగా వెళ్లింది''

''ఊ. రేపీపాటికి ఆ ఇంట్లో ఉంటాం. రెండ్రోజుల్లో సర్దుడు అయిపోవాలి. ఒళ్లు పులిసిపోయింది''

''సరస్వతీ, అన్ని అట్టపెట్టెల్లో పనికి రానివి కొన్నిగూడా లేవా?''

పగలబడి నవ్విందామె.

''లేవు''

''ప్లీజ్. చెత్త ఒదుల్చుకోవడం మంచిది. మళ్లీ అన్నీ మోసుకెళ్లి అక్కడ అవస్థ పడే బదులు...''

''ఇక్కడే అన్నీ పారెయ్యడం మంచిది''

''అన్నీ అనడం లేదు. నువ్వు చూసి అనవసరమైనవి అవతలపారెయ్''

''నాకు తెలీకడుగుతాను. అనవసరమైనవంటే ఏవండీ?''

''కాదు. మనకి పెద్దగా అవసరం లేనివి''

''అదే. అంటే ఏవిటి? అదెవరు నిర్ణయిస్తారు''

''అలా అంటే చెప్పలేను. బరువు తగ్గించుకోమని మాత్రం చెప్పగలను''

''అదేనండీ పోనీ ఒక వస్తువు పేరు చెప్పండి''

''ఉదాహరణకి ఆ దిక్కుమాలిన కుట్టుమిషను''

''మీకు అదంటే మొదట్నించీ అసహ్యం''

''ఓపిక లేదంటూనే శ్రమపడ్డం నీ కిష్టం అనుకుంటాను''

''సంసారం చెయ్యదలచుకుంటే అలాగే ఉంటుంది మరి''

''అంతేనంటావా?''

''పోనీ మీరు చెప్పండి''

మెట్లకిందనుంచి ''అమ్మా'' అని పిలిచాడు బాబీ.

సరస్వతి కిందికి వెళ్లిపోయింది. చుక్కల వేపు చూస్తుండగా ఎప్పుడో నిద్ర పట్టినట్టుంది. పెద్ద ఇల్లు కడుతున్నట్టూ, అందులో నా గది అందంగా విశాలంగా ఉన్నట్టూ కలొచ్చింది.

మర్నాడు ఆదివారం. ఆఫీసు ఎలాగూ లేదు. ఉదయం వెళ్లి లారీ మాట్లాడి వచ్చేను. సరిగ్గా నాలుగు గంటలకి నలుగురి మనుషుల్ని తీసుకొస్తానన్నాడు.

''లారీ వెళ్లగానే ఓసారి గదులన్నీ చూడండి. ఎక్కడేనా ఏవేనా ఒదిలేశారేమో''

''అలాగే... నువ్వు ఏవేనా మిగిలిస్తే గదా''

''ఇదిగో, టీ తాగుతూ వరండాలో కూచోండి. లేదా మాకు సహాయం చెయ్యండి. నస పెడితే ఊరుకునేది లేదు''

''ఈ చెత్తంతా చూస్తూ ఎలా కూచోను?''

టీకప్పు తీసుకుని వరండాలోకి వెళ్లిపోయాను. ''అమ్మయ్య'' నా వీపుకి తగిలి పడిపోయింది. టీ చప్పరిస్తున్నా, కలవరం తగ్గలేదు. రెండ్రోజుల్లో కొత్త ఇంట్లో అన్నీ సర్దుకున్న తరువాత కలవరం తగ్గుతుందనుకుంటాను. లోపల్నించి

సరస్వతి మాటలు వినిపిస్తూనే వున్నాయి.

''బాబీ నువ్వు సామాన్లతో వెళ్లు. జాగ్రత్త. జాగర్తగా అన్నీ దింపించు. దిగిం తరువాత లారీలో చూడు. సామాన్లు కళ్లు పెట్టుకు చూడు.''

''సరేలేవే''

''ఆ రెండు పెద్ద పెట్టెలూ దగ్గరికి జరుపు. ఈ సామానంతా మెల్లిగా ఒక దాంట్లో సద్దు. గంటలో అంతా అయిపోవాలి''

''ఈ టేబిలు లైటు చెడిపోయిందమ్మా''

''అయితే ఏం? తరువాత బాగుచేయించు. అన్నీ మీ నాన్న అవలక్షణాలు''

నాకు బయట కూచోడం కష్టంగా ఉంది. లోపలికెళ్లి కాలితో ఓ పెట్టె నెట్టి కుర్చీ జరుపుకుని కూర్చున్నాను.

''ఏం మళ్లీ వచ్చారు పాపం''

''ఓరేయ్ బాబీ, నాకు అన్నీ చూపించు. అసలు ఇన్ని పెట్టెలెందుకు? ఇటు లాగు. ఆ గోనె సంచులేవిటి?''

''అవి వంటింటి సామాను. ఇంకా ఉన్నాయి''

''అదేవిటి ఆ చిన్న డబ్బా''

''మేకుల పెట్టె నాన్నా''

''అన్ని మేకులా? ఊళ్లో అందర్ని శిలువేసినా మిగుల్తాయి''

''కొత్త ఇంట్లో మేకులు కొట్టుకోరా ఏవిటండీ!''

''అయితే? డబ్బాడు పాత మేకులా? సగం అవతల పారెయ్యరా. గోడలకి మేకులు కొట్టద్దన్నాడు''

''బావుంది మీరూరుకోండి. నేను కొడతాను. ఎవడడ్డొస్తాడో చూస్తాను''

''అసలు గోడల్నిండా మేకులు కొట్టడం ఏవిటి? ఏవేనా అర్థం ఉందా?''

''మీకు లేదు. మాకుంది. ఈ పటాలు మెళ్లో తగిలించుకుంటామా?''

''మేకులు. పటాలు. మేకులు. ఇదివరకున్నవాళ్లు కొన్ని కొట్టి ఉంటారు''

''అవి నేను పీకిస్తాను. లేకపోతే మీరు పీకండి. ఆ ఒక్కటీ చెయ్యండి''

''ఈ మేకుల డబ్బా కచ్చితంగా అవతల పారేస్తాను''

''ఊహూ''

''బాబిగా. నీ కాలి దగ్గర ఆ ఎర్ర ప్లాస్టిక్ డబ్బా ఏవిటి?''

''అమ్మవి''

''గుడ్‌గాడ్. వెంట్రుకల ముద్ద. సరస్వతీ ఈ వెంట్రుకలు కూడా అవసరమేనా! అసలీ వెంట్రుకలెవరివీ?''

''చాల్లెండి. నావే. మంచి సవరం చేయించుకుందామని దాచేను''

''కొనుక్కోవచ్చుగా. వెంట్రుకలు దాచుకోవడం ఎందుకు?''

''అవి నావి. నేను దాచుకున్నాను. మీకెందుకీ గొడవ''

''నీక్కూతురుంటే దానికీ కేశ సంపద ఇచ్చేదానివేగా?''

''అంతకంటేనా? అందులో నా వెంట్రుకలు''

''ఇది దాచుకోక తప్పదా?''

''తప్పదు''

''ఒక్క వస్తువు పనికిరానిది లేదు. పారెయ్యడానికి వీలులేదు''

''శ్శ్. భగవంతుడా. ఒరే నాయినా, అలమార దగ్గిర కాయితాల కట్ట ఉంది ఇలా పట్రా''

''ఏమిటవి?''

''పాత పేపర్లు. పదో పదిహేనో ఉంటాయి. తీసికెళ్లి తృప్తిగా బయట పారేసిరండి''

సాయంకాలం అయ్యే కొద్దీ ఇల్లంతా డబ్బాలతో, మూటలతో, పెట్టెలతో నిండిపోయింది. గోనె సంచులు పందుల్లా ఓ మూల కూచున్నాయి. గదులన్నీ తిరిగేను. విరిగిన టూత్‌బ్రష్షూ, దువ్వెన ముక్కా, పాత ఉత్తరాల ముక్కలు, ఖాళీ నూనె సీసాలు, రీఫిల్ లేని బాల్‌పాయింట్ పెన్ను. అయిదు సంవత్సరాల అవశేషాలు ఇవే మిగిలాయి. నా ఆలోచనలు, ఆవేశాలు, ఉద్రేకాల వెచ్చదనం ఆవరించుకున్న ఈ గది దుమ్ము వాసన కొట్టే శూన్యం.

సరిగ్గా నాలుగయేసరికి బయట లారీ ఆగిన చప్పుడూ, హారన్ ఒకేసారి వినిపించాయి. సరస్వతి బాబిగాణ్ణి పిలిచింది.

''సామాన్లు ఎత్తించగానే సైకిలుమీద లారీతో వెళ్లు. వెనక రిక్షాలో నేనూ నాన్న వస్తాం. జాగ్రత్త సామాన్లు''

హాల్లో ఒక్కణ్ణే ఉన్నాను. గేటు తీసుకుని నలుగురు మనుషులొచ్చారు. సిగరెట్ వెలిగించి చూస్తూ ఉండిపోయాను.

''సామాన్లెయ్యడానికి ఒచ్చేనండి''

''ఊఁ''

సామాన్లు లారీని నింపుతున్నాం. కాసేపటికి ఇల్లు ఖాళీ అయిపోయింది. సరస్వతి తాళం పెట్టి వచ్చింది. సైకిలు బయటికి తీశాడు బాబీ. గేటు దగ్గర నుంచున్నాను. లారీ వెనక తలుపు భళ్లున వేశారు నలుగురూ. హారన్ ఆక్రోశంతో లారీ బయల్దేరుతోంది. బాబీ సైకిలెక్కాడు. మెల్లిగా లారీ కదిలి నా వీపుమీదికి పాకింది.

*